సాక్షి అన్నమయ్య జిల్లా

ఆదివారం । 24 । మార్చి । 2024

I



పరీక్షా కేంద్రం వద్ద ఉద్రిక్తత

గుర్రంకొండ తెలుగు జెడ్పీహైస్కూల్లో నిర్వహించిన పదో తరగతి పరీక్షా కేంద్రంలో విద్యార్థినిని వేధించవద్దని అన్నందుకు విద్యార్థులపై కొందరు దాడి చేశారు. -IIలో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ ఆది (సా॥)	సహర్ సోమ (ఉ॥)
రాయచోటి :	6.30	5.02
రాజంపేట :	6.31	4.58
పీలేరు :	6.33	4.54
మదనపల్లె :	6.32	5.01

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.160	రూ.200
రెండోరకం	రూ.100	రూ.150

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 20 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	451	472
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 222.780 కిలోలు

న్యూస్‌రీల్

కొనసాగుతున్న పది పరీక్షలు



పరీక్షలు రాసి పరీక్ష కేంద్రం నుంచి బయటికి వస్తున్న విద్యార్థులు

రాయచోటి టౌన్ : పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. శనివారం ఫిజికల్ సైన్స్ పరీక్ష ఉదయం 9–30 గంటల నుంచి 11–30 గంటల వరకు నిర్వహించారు. సైన్స్ పరీక్ష మాత్రం రెండు విభాగాలుగా నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఫిజికల్ సైన్స్ 50 మార్కులకు, న్యాచురల్ సైన్స్ పరీక్ష 50 మార్కులకు నిర్వహించనున్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 22518 మంది విద్యార్థులు రెగ్యులర్ విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 21,854 హాజరయ్యారు. అలాగే 663 మంది ప్రైవేట్‌గా హాజరు కావాల్సి ఉండగా470 మంది హాజరయ్యారు. మొత్తం 129 సెంటర్ల ద్వారా ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డీఈవో తెలిపారు.

నేటి నుంచి నీలకంఠ్రావుపేట దర్గా ఉరుసు



విద్యుత్ దీపాలతో ఉరుసుకు సిద్ధమైన దర్గా

రామాపురం : ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని అన్నమయ్య జిల్లా రామాపురం మండలం నీలకంఠ్రావుపేట సమీపంలోని దర్గా వద్ద ఉరుసు మహోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభమవుతాయని ఆలయ కమిటీ సభ్యులు సత్యమయ్యస్వామి, శంకరయ్యస్వామి తెలిపారు. సద్గురు హజరత్ దర్బార్ ఆలీషా వలి రహంతుల్లా అలైబాబా, జలీల్ మస్తాన్‌వలి బాబాల ఉరుసు మహోత్సవాలు ప్రతి ఏటా హోలి పండుగ రోజు నుంచి ప్రారంభమవుతాయన్నారు. ఆదివారం దర్గా వద్ద గంధం మహోత్సవం, సోమవారం జెండా మెరవణి, రాత్రి బెంగళూరుకు చెందిన సిమ్ ర్యాతాజ్, నాగ్‌పూర్‌కు చెందిన నసీమ్ జానిల మధ్య ఖవ్వాలి పోటీ జరుగుతుందన్నారు. మంగళవారం తహలీల్ మహా నైవేద్యం పంపిణీ చేస్తారని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉరుసులో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఐ లక్ష్మీప్రసాద్‌రెడ్డి తెలిపారు.

24, 25 తేదీల్లో విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు

కడప కార్పొరేషన్: ఆది, సోమవారాలు సెలవు దినాలు అయినప్పటికీ విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు అవకాశం కల్పించినట్లు ఏపీఎస్‌పీడీసీఎల్ ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈ ఎస్. రమణ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారుల సౌకర్యార్థం ఈనెల 24, 25 తేదీల్లో విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలు యథావిధిగా పనిచేస్తాయన్నారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని బిల్లులు సకాలంలో చెల్లించి సంస్థ పురోభివృద్ధికి సహకరించాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

వైవీయూ: ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలల్లో 2024–25 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గురుకుల విద్యాలయాల జిల్లా కన్వీనర్ సోమ సత్యశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 31వ తేదీలోపు ఏపీఆర్ఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 5వ తరగతి, 6,7,8 తరగతుల్లో మిగిలిన సీట్లు, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం, డిగ్రీ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాల కోసం ఏప్రిల్ 25వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 85559 02362, 97011 33148 నెంబర్లో సంప్రదించాలని కోరారు.

నేడు షార్ట్‌హ్యాండర్ల సమావేశం, ఎన్నికలు

కడప కల్చరల్: ఆంధ్రప్రదేశ్ టైప్‌రైటింగ్, షార్ట్‌హ్యాండ్ ఇనిస్టిట్యూట్స్ అసోసియేషన్ 7వ వార్షికోత్సవం, ఎన్నికలను ఆదివారం స్థానిక హరిత హోటల్‌లో నిర్వహించనున్నట్లు అసోసియేషన్ ప్రెసిడెంట్ శివకుమార్, కార్యదర్శి నవీన్‌కుమార్‌లు తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 10 గంటలకు కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ జిల్లాల టైప్‌రైటింగ్ ఇనిస్టిట్యూట్ ప్రిన్సిపాళ్లు, ఇతర సిబ్బంది కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమానికి సోషల్ వెల్ఫేర్ డీడీ సరస్వతి, గ్రౌండ్ వాటర్ ఆడిట్ విభాగం డీడీ కె.సన్నన్న, వైవీయూ ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డిలు అతిథులుగా పాల్గొంటారన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు 2024–25 సంవత్సరానికిగాను సంస్థ ఎన్నికలు నిర్వహిస్తామని, నూతన కమిటీ సాయంత్రం 5 గంటలకు ప్రమాణ స్వీకారం ఉంటుందని తెలిపారు.

వేసవిని జయిద్దాం

- సీపీడబ్ల్యూఎస్ స్కీములన్నీ పనిచేసేలా చూడాలి
- కట్టుదిట్టంగా ఎన్నికల మోడల్ కోడ్‌ను అమలు చేయాలి
- కలెక్టర్ అభిషిక్త్ కిషోర్



జిల్లా అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

రాయచోటి: వేసవిలో జిల్లాలో తాగునీటి ఎద్దడి నివారణకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని, ఇందుకు తగిన కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం రాయచోటి కలెక్టరేట్ నుంచి ఈ వేసవిలో జిల్లాలో నీటి ఎద్దడి నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, ఉపాధిహామి పనుల కల్పన, హౌసింగ్ మ్యాన్ డేస్, ఎన్నికల మోడల్ కోడ్ అమలు తదితర అంశాలపై ఆర్డీఓలు, ఎంపీడీఓలు, ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్, పంచాయతీ, ఉపాధిహామీ, మున్సిపల్ శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్షించి పలు అంశాలలో తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా సీపీడబ్ల్యూఎస్, పీడబ్ల్యూఎస్, ఎంపీడబ్ల్యూఎస్ స్కీములు ఎన్ని, వాటి పరిస్థితి, ఎన్ని స్కీములు ద్వారా నీటి సరఫరా జరుగుతున్నాయి. వాటికిగల నీటి సోర్స్, సోర్స్ లేనిచోట నీటి సరఫరాకు తీసుకున్న చర్యలపై అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా జిల్లాలోని వెలిగల్లు, ఝరికోన ప్రాజెక్టుల నీటి సామర్థ్యం ఎంత, ప్రస్తుతం ఉన్న నీటి నిల్వలు, ఆ ప్రాజెక్టుల ద్వారా తాగు, సాగునీటికి వినియోగిస్తున్న నీటి శాతం తదితర అంశాలపై ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్, పంచాయతీ, మున్సిపల్ కమీషనర్లు, ఎంపీడీఓలతో సుదీర్ఘంగా చర్చించి... పలు సూచనలు జారీ చేశారు. నీటి సరఫరా అత్యంత ప్రాముఖ్యత కల్గిన పని కావున అవసరమైనచోట కొత్తగా చేపట్టే పనులకు సంబంధిత ఎన్నికల రిటర్నింగ్ అధికారికి తెలిపి అనుమతి పొంది పనులు చేపట్టాలన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధిహామి పథకం ద్వారా లేబర్ బడ్జెట్, సెల్ఫ్ ఆఫ్ వర్క్స్ ఆధారంగా కుటుంబాలకు, వ్యక్తిగత కూలీలకు ఉపాధి పనులను విరివిగా కల్పించాలన్నారు. కరువు మండలాల్లో పనుల కల్పనపై దృష్టి కేంద్రీకరించాలన్నారు. ఈ నెలాఖరుకు వార్షిక సంవత్సరం ముగుస్తున్నందున లక్ష్యాలను చేరుకునేందుకు విరివిగా పనులను కల్పించాలన్నారు. హౌసింగ్ మ్యాన్‌డేస్‌లో భాగంగా లక్ష్యాలను పూర్తి చేయాలని అధికారులకు సూచనలు చేశారు. జిల్లా వ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తన నియమావళిని కట్టుదిట్టంగా అమలు చేయాలన్నారు. ఇప్పటి వరకు మోడల్ కోడ్ అతిక్రమణలో నేరుగా లేదా సి విజిల్ యాప్ ద్వారా వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలన్నారు. ఐటీ అప్లికేషన్లను ప్రతి రోజూ పరిశీలించి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డ్వామా పీడీ మద్దిలేటి, ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్ ఎస్ఈలు ప్రసన్న కుమార్, వెంకట్రామయ్య, ఇరిగేషన్ డీఈ కృష్ణమూర్తి, డీపీఓ ధనలక్ష్మీ, ఆర్డీఓలు రంగస్వామి, మోహన కుమార్, హరిప్రసాద్, ఎంపీడీఓలు, ఆయాశాఖల ఈఈ, డీఈ, ఏఈలు, ఏపీడీలు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి పాటించాల్సిందే...

జిల్లాలో ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ ఎంసీసీ నిబంధనలు తప్పక పాటించాలని కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ రాజకీయ పార్టీ నాయకులకు సూచించారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్సు హాల్‌లో జిల్లా కలెక్టర్ వివిధ రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. వచ్చే సాధారణ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఎన్నికలలో ఎంసీసీ నిబంధనలు పాటించని వారిపై చర్యలు తప్పవన్నారు. ఎన్నికల కమీషన్ ఎప్పటికప్పుడు జారీ చేసే నిబంధనలను చక్కగా అవగాహన చేసుకొని నిర్దేశిత సమయంలోనే పనులు పూర్తి చేయాలన్నారు. జిల్లాలో ఎక్కడైనా ఎంసీసీ వైలేషన్స్ జరిగినట్లు తమ దృష్టికి వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో ఎన్నికల ఫిర్యాదులు, ఇతర వివరాలుకోసం ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబరు. 1800 425 7090 కు ఫోన్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఆర్‌ఓ సత్యనారాయణ, ఆర్‌ఓలు, వివిధ రాజకీయ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మాధవరంలో విషాదం





పట్టాలపై సుబ్బారావు మృతదేహం తల్లి, కుమార్తె మృతదేహాలు

- ఒకే కుటుంబంలో ముగ్గురు బలవన్మరణం
- కొత్తమాధవరం కన్నీటిమయం
- రెవెన్యూ అధికారులు మోసం చేశారని 'సూసైడ్‌నోట్'



సుబ్బారావు



పద్మావతి (ఫైల్)



వినయ (ఫైల్)

ఒంటిమిట్ట(రాజంపేట):రాజంపేట నియోజకవర్గం ఒంటిమిట్ట మండలం కొత్త మాధవరంలో శనివారం విషాదం చోటుచేసుకుంది. చేనేత కార్మికుడిగా జీవనం సాగిస్తున్న పాలెం సుబ్బారావు (47) కుటుంబం ఆత్మహత్యకు పాల్పడింది. భార్య పద్మావతి (41), కుమార్తె వినయ (17) ఇంట్లో ఆత్మహత్యకు పాల్పడగా, పాలెంసుబ్బారావు (47) ఒంటిమిట్ట సమీపంలోని రైల్వే ట్రాక్‌పై రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సుబ్బారావు పెద్దకుమార్తె నిత్య లక్ష్మీప్రసన్న హైదరాబాద్‌లో చదువుకుంటోంది. నేతన్న కుటుంబం బలవన్మరణంతో కొత్తమాధవరం కన్నీటిమయమైంది.

తహసీల్దార్ వివరణ..

ఈ విషయంపై స్థానిక తహసీల్దారు వెంకటరమణ విలేకర్లతో మాట్లాడుతూ తాను ఎన్నికల బదిలీలో భాగంగా ఇక్కడికి వచ్చానన్నారు. భూమి రికార్డులు తారుమారు చేశారనే ఆరోపణలపై విచారణ జరిపి సమగ్ర నివేదికను ఉన్నతాధికారులకు పంపుతానని స్పష్టం చేశారు.

సంఘటన స్థలానికి పోలీసులు..

సుబ్బారావు కుటుంబం బలవన్మరణానికి పాలడిన సంఘటన నేపథ్యంలో కడప డీఎస్పీ షరీఫ్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను పరిశీలించారు. సీఐ పురుషోత్తమరాజు, సిద్దవటం ఎస్ఐ పెద్దఓబయ్య కూడా ఆయన వెంట ఉన్నారు. అంతకుముందు సీఐ పురుషోత్తమరాజు తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని ఆత్మహత్యకు గల కారణాల గురించి అడిగి తెలుసుకున్నారు. డాగ్ స్క్వాడ్, క్లూస్‌టీం ఆధారాలను సేకరించారు. కాగా సుబ్బారావు భార్య,బిడ్డను హత్యచేసి, ఆ తర్వాత రైలుకింద పడ్డాడా, ఇంట్లోని వారిని ఎవరైనా హత్య చేశారా? వారే ఆత్మహత్య చేసుకున్నారా? సూసైడ్‌నోట్ మృతుడు రాసిందేనా.. ఇలా వివిధ అంశాలపై పోలీసులు విచారణకు దిగారు.

కడప డీఎస్పీ ఏమంటున్నారంటే..

ఈ సంఘటనపై కడప డీఎస్పీ షరీఫ్ మాట్లాడుతూ అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని, అసలు కారణాలను బహిర్గతం చేస్తామని వివరించారు. సూసైడ్‌నోట్‌ను కూడా పరిశీలించాల్సి ఉంటుందన్నారు. కాగా పోలీసులు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేశారు. ఇది డీకేటీ భూమి అని తెలిపారు.

సూసైడ్ నోట్ ప్రకారం....

పాలెంసుబ్బారావుకు 2187/2 సర్వే నంబరులో 3.10 ఎకరాల భూమి ఉంది. ఖాతా నంబరు 1712 ప్రకారం పీఎం కిసాన్ డబ్బులు కూడా పడుతున్నాయి. గతంలో సుబ్బారావు తండ్రికి వైద్యం కోసం రూ.4లక్షలు, తమ్ముడి పెళ్లికి రూ.3లక్షల వరకు ఖర్చు అయింది. ఈ నేపథ్యంలో తనకున్న మూడు ఎకరాల పొలాన్ని అమ్మాలని ఇటీవల నిర్ణయించుకుని రికార్డులను పరిశీలించారు. తమ పేరుగల భూమి శ్రావణి పేరుతో రెవెన్యూ రికార్డులో ఉందని అధికారులు చెప్పడంతో మనస్తాపానికి గురయ్యారు. తమ భూమిని అధికారులు కుమ్మక్కై తారుమారు చేసినట్లు తెలియడంతో ఇక తమకు ఆ భూమి దక్కదన్న ఆందోళనతో ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు అందులో పేర్కొన్నారు. 'మా ఇంట్లోవారికి, అప్పులు ఇచ్చిన వారికి ఏమీ సంబంధంలేదంటూ ... మేము ఏమి చేయలేమని స్థితిలో చనిపోతున్నా'మని సూసైడ్‌నోట్‌లో రాసుకొచ్చారు.



సూసైడ్‌నోట్ చూపిస్తున్న కడప డీఎస్పీ షరీఫ్

జోరుగా కళాశాల నిర్మాణ పనులు

- జూలై నాటికి పూర్తిస్థాయిలో పనులు పూర్తి
- అభివృద్ధి పనులపై సంతృప్తి వ్యక్తం చేసిన డీఎంఈ



మాట్లాడుతున్న డీఎంఈ రఘునందన్


మదనపల్లె : రాజంపేట పార్లమెంటరీ పరిధిలో ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్మాణం జరుపుకుంటున్న మదనపల్లె మెడికల్ కాలేజీలో వచ్చే విద్యాసంవత్సరం నుంచి తరగతులు ప్రారంభించేందుకు ఏర్పాట్లు పూర్తికావచ్చాయని విజయవాడకు చెందిన ఏపీ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (అకడమిక్) రఘునందన్ తెలిపారు. శనివారం మదనపల్లెకు వచ్చిన ఆయన...జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో మెడికల్ కళాశాలకు సంబంధించి నిర్మాణంలోని భవనాలను పరిశీలించారు. అనంతరం మెడికల్ సూపరింటెండెంట్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో డీఎంఈ రఘునందన్ మాట్లాడుతూ...మదనపల్లె మెడికల్ కాలేజీ అడ్మిషన్లకు సంబంధించి 150మంది యూజీ విద్యార్థులు జూలై చివరి లేదా ఆగస్టు మొదటివారంలో రానున్న సందర్భంగా జిల్లా ఆస్పత్రి, మెడికల్ కళాశాల వద్ద ఏర్పాట్లను పరిశీలించేందుకు వచ్చామన్నారు. 420 బెడ్స్ జిల్లా ఆస్పత్రిలో సిద్ధంగా ఉన్నట్లు నేషనల్ మెడికల్ కౌన్సిల్ తనిఖీల్లో చూపామన్నారు. మిగిలిన వైద్యపరికరాలు, సామగ్రి విడతల వారీగా కల్పిస్తామని చెప్పామన్నారు. ఇప్పటికే 75శాతం పనులు పూర్తయ్యాయని, మిగిలినవి విడతలవారీగా జరుగుతున్నాయన్నారు. విద్యార్థులు వచ్చేలోపు వారికి కావాల్సిన వసతులు విడతల వారీగా జూలై చివరికి పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కళాశాల భవన నిర్మాణపనుల ప్రగతిపై సంతృప్తిగా ఉన్నామని, ఏపీఎండీసీ అధికారులు త్వరితగతిన పూర్తిచేయడంపై హర్షం వ్యక్తం చేశారు.

టీడీపీ హయాంలోనే ఆన్‌లైన్ మార్పు


ఒంటిమిట్ట: కొత్తమాధవరం ముగ్గురు మృతి ఘటనపై శవ రాజకీయాలు సరికాదని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ డైరెక్టర్ ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి అన్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో అన్యాయం జరిగిందంటూ రాజంపేట టీడీపీ పార్లమెంటరీ అధ్యక్షుడు చమర్తి జగన్మోహన్ రాజు వ్యాఖ్యలను ఆయన ఖండించారు. 2015లో టీడీపీ హయాంలోనే సుబ్బారావు తండ్రి పాల వెంకటచలపతి పేరుతో 2187/2 సర్వే నెంబరు ఖాతా నెంబరు 1712ను ఆన్‌లైన్ చేసుకోవడం జరిగిందని, ఇది ఇలా ఉండగా అదే పరిపాలన సంవత్సరం అయినటువంటి 2017లో అదే సర్వే నెంబరులోగల ఖాతా నెంబర్‌ను కట్టా శ్రావణి పేరుతో ఆన్‌లైన్ మార్చారన్నారు. టీడీపీ నాయకులు వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు.

● ఆహా నుంచి.. హా..హా వరకు

కళతప్పిన హార్సిలీహిల్స్



హార్సిలీకొండ అటవీప్రాంతం



ఘాట్‌రోడ్డుకు ఇరువైపులా ఎండిపోయిన వృక్షాలు

- చల్లటిగాలులు కరువై..పెరిగిన వేడిసెగలు
- తగ్గిన పర్యాటకుల రాక

బి.కొత్తకోట: అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట మండలంలోని వేసవివిడిది కేంద్రం హార్సిలీహిల్స్ పచ్చదనం కోల్పోతోంది. ఈ కొండ సముద్రమట్టానికి 1265.53 మీటర్ల (4141 అడుగులు) ఎత్తులో ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో దక్షిణాన ఉన్న ఎత్తయిన పీఠభూమి ఇది. బి.కొత్తకోట, కురబలకోట, మదనపల్లె, నిమ్మనపల్లె మండలాల్లో వాగులు, ఏరు ఏర్పడడానికి హార్సిలీకొండ కారణం. పచ్చనిచెట్లు, ఎత్తయిన వృక్షాలకు, చల్లటి వాతారణానికి ఆలవాలమైన కొండ ఇప్పుడు పచ్చదనం కోల్పోయింది. దీనికి వర్షాభావ పరిస్థితులే కారణం. ప్రతివేసవిలో పర్యాటకులు ఇక్కడ సేదతీరేందుకు వేలసంఖ్యలో తరలివస్తారు. కొండకు నాలుగువైపులా అడవే. ఎటుచూసినా మహావృక్షాలు కనిపిస్తాయి. హార్సిలీహిల్స్‌పై వాతారణం ఓ ఎత్తయితే..ఆశ్చర్యం గొలిపే వృక్షాలు మరోఎత్తు. 1882లో 16వ సెక్షన్‌కింద కొండలోని అటవీప్రాంతాన్ని, సంపదను రిజర్వ్ ఫారెస్టుగా ప్రకటించారు. మొత్తం 8,755 హెక్టార్లలో అడవులు విస్తరించి ఉన్నాయి. ఇందులో రిజర్వుఫారెస్టు 6,231 హెక్టార్లు, 'ఎ' రిజర్వ్‌ఫారెస్టు 1,348 హెక్టార్లు, 'బీ' రిజర్వ్‌ఫారెస్టు 1,176 హెక్టార్లు ఉంది. ఇంతటి అటవీ ప్రాంతం ఉన్న కొండపై ప్రస్తుతం పచ్చదనం కనిపించడం లేదు. ఎటుచూసిన ఎండిన వృక్షాలు, మోడు వారిన చెట్లు, కనిపిస్తున్నాయి. పచ్చదనం లేక చల్లదనం మాయమైపోతోంది.

భారీగా తగ్గిన పర్యాటకులు

రాష్ట్రంలో అరకు తర్వాత అతిశీతల ప్రదేశం హార్సిలీహిల్స్. ఇక్కడ ఉక్కపోసిన సందర్భం చాలా అరుదు. పర్యాటకులు, స్థానికులు ఏసీలు, ఫ్యాన్లతో అవసరంలేకుండా నిద్రిస్తారు. అలాంటిది ప్రస్తుతం ఉక్కపోత భరించలేకపోతున్నారు. రాత్రివేళ్లలో చల్లటిగాలులు కరువయ్యాయి. మేఘాలు వర్షిస్తేకానీ చల్లదనం లేని పరిస్థితులు నెలకొన్నాయి. మార్చి మాసంలోనే ఇలాంటి ఆందోళనకర పరిస్థితులు నెలకొనడంపై ప్రకృతి ప్రియులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీని ప్రభావం పర్యాటకులపై చూపుతోంది. తమిళనాడు, కర్ణాటక నుంచి అధిక సంఖ్యలో పర్యాటకులు వస్తారు, ఇప్పుడు వీరిరాక ఆగిపోయింది. హార్సిలీహిల్స్ చుట్టూ దట్టమైన అడవులు ఉన్నా చల్లటిగాలి కరువైంది.

తగ్గిన వర్షపాతం..పెరిగిన ఉష్ణోగ్రత



కొండపై ఏడాదికి సరాసరి వర్షపాతం 900 మి.మీ కురవాలి. అయితే ఈస్థాయిలో వర్షం కురిసి చాలా ఏళ్లవుతోంది. అసాధారణ పరిస్థితుల్లోనూ హార్సిలీహిల్స్‌లో ఉష్ణోగ్రత 30 డిగ్రీల సెల్సియస్‌కు మించదు. ఇప్పుడు 35నుంచి 40డిగ్రీల మధ్య ఉంటోంది. సాధారణంగా జనవరి మాసంలో 5 సెంటీగ్రేడ్‌కు చేరుకుంది. గడచిన రెండేళ్లగా జనవరి మాసంలోనూ సాధారణంగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మారుతున్న వాతావరణ పరిస్థితులకు పచ్చదనం కరువైపోవడమే కారణంగా కనిపిస్తోంది. వర్షాలుకురిసి తిరిగి పచ్చదనం చేకూరితే తప్ప చల్లదనం రాకపోవచ్చు.

క్లుప్తంగా

ఆత్మహత్యకు యత్నించిన యువకుడి మృతి

మదనపల్లె : ఆత్మహత్యకు యత్నించి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ, యువకుడు మృతి చెందిన సంఘటన శనివారం మండలంలో జరిగింది. తట్టివారిపల్లెకు చెందిన మధు కుమారుడు ముదివేటి హరీష్(23) భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. కుమారుడు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తుండటంతో తల్లిదండ్రులు మందలించారు. దీంతో ఈనెల 6న మనస్తాపం చెందిన హరీష్ ఇంట్లోనే ఎలుకలమందు తిని ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతి స్విమ్స్‌కు రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు సీఐ ఎస్.శేఖర్ తెలిపారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు


ప్రీతి (ఫైల్)

మదనపల్లె : వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు తాలూకా సీఐ ఎస్.శేఖర్ తెలిపారు. కోళ్లబైలు పంచాయతీ వైఎస్సార్ కాలనీకి చెందిన జగదీష్ భార్య కదిరి ప్రీతి(25) ఈనెల 22 నుంచి కనిపించడం లేదు. ప్రీతికి మూడేళ్ల క్రితం వివాహం కాగా, ఒక కుమారుడు ఉన్నాడు. ఆమె ఆచూకీ కోసం తెలిసిన వారి ఇళ్లలో, పట్టణంలో పలుచోట్ల గాలించినా ఫలితం లేకపోవడంతో కుటుంబ సభ్యులు శనివారం తాలూకా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ ఎస్.శేఖర్ మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

లింగ నిర్ధారణ చట్టం పక్కాగా అమలు చేయాలి

రాయచోటి అర్బన్ : జిల్లాలో లింగనిర్ధారణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని డీఎం అండ్‌హెచ్‌ఓ డాక్టర్ కొండయ్య అన్నారు. శనివారం డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయంలో జిల్లా సలహామండలి పీసీపీఎన్‌డీటీ, సరోగసి యాక్టు కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్కానింగ్ కేంద్రాలలో లింగనిర్ధారణ చట్టరీత్యా నేరం అని తెలుగు, ఇంగ్లీషులో హాస్పిటల్ గోడలపైన, బిల్లులపైన ముద్రించాలని ఆదేశించారు. స్కానింగ్ గదిలోకి గర్భిణిని తప్ప వారి సహాయకులను అనుమతించరాదన్నారు. జిల్లా నోడల్ అధికారిణి ఉషశ్రీ, ప్రోగ్రామ్ ఆఫీసర్ దేవశిరోమణి, వైద్యులు డేవిడ్ సుకుమార్, వెంకటశివ, జీనత్‌బేగం, హీనా, ఎన్‌జీఓ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

మాస్ కాపీయింగ్‌కు సహకరించలేదని విద్యార్థినిపై దాడి

- అడ్డుకున్న విద్యార్థులపైనా దాడికి దిగిన వైనం
- గుర్రంకొండలో టెన్త్ పరీక్షా కేంద్రం వద్ద ఉద్రిక్తత


గుర్రంకొండ తెలుగు జెడ్పీహైస్కూల్‌పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులపై దాడి చేస్తున్న తోటి విద్యార్థులు

గుర్రంకొండ : గుర్రంకొండ తెలుగు జెడ్పీహైస్కూల్లో నిర్వహించిన పదవ తరగతి పరీక్షా కేంద్రంలో విద్యార్థినిని వేధించవద్దని అన్నందుకు విద్యార్థులపై మరి కొంతమంది విద్యార్థులు దాడులకు దిగారు. పరీక్షా కేంద్రంలో మాస్‌కాపీయింగ్‌కు సహకరించలేదని ఓ విద్యార్థినిపై కొంతమంది ఆకతాయి విద్యార్థులు దాడి చేశారు. ఇదేంటని ప్రశ్నించిన తోటి విద్యార్థులపై కూడా వారు ముకుమ్మడి దాడికి పాల్పడ్డారు. పోలీసులు చెదరగొట్టడంతో అక్కడి నుంచి బస్టాండుకు చేరుకొన్న విద్యార్థులపై మరోసారి బహిరంగంగా దాడికి దిగారు. వివరాలు ఇలా ఉన్నాయి. గుర్రంకొండకు చెందిన రెండు ప్రభుత్వ పాఠశాలలు, రెండు ప్రైవేట్ పాఠశాలు, చెర్లోపల్లె, ఎల్లుట్ల, టి.పసలవాండ్లపల్లె గ్రామాలకు చెందిన విద్యార్థులు స్థానిక తెలుగు జెడ్పీహైస్కూల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో పదవ తరగతి పరీక్షలు రాస్తున్నారు. శనివారం ఫిజిక్స్ పరీక్ష రాశారు. పరీక్షా కేంద్రంలో చెర్లోపల్లె హైస్కూల్‌కు చెందిన ఓ విద్యార్థినిని మాస్‌కాపీయింగ్‌కు సహకరించాల్సిందిగా గుర్రంకొండకు చెందిన విద్యార్థి కోరాడు. అందుకు సదరు విద్యార్థిని అంగీకరించలేదు. పరీక్షా సమయం ముగిసిన తరువాత విద్యార్థిని గది నుంచి బయటికొస్తుండగా మాస్‌కాపీయింగ్‌కు సహకరించలేదని మనసులో కక్ష పెంచుకొన్న గుర్రంకొండ విద్యార్థి ఆ విద్యార్థిని కాళ్లకు అడ్డంగా ప్యాడ్‌ను ఉంచడంతో కింద పడిపోయింది. దీంతో అదే హైస్కూల్‌కు చెందిన తోటి విద్యార్థులు ఇదేంటని ప్రశ్నించారు. దీంతో రెచ్చిపోయిన గుర్రంకొండ విద్యార్థి మరికొంతమంది ఆకతాయిలతో కలసి వారిపై దాడులకు పాల్పడ్డాడు. అక్కడ విధులు నిర్వహిస్తున్న పోలీసులు వారిని చెదరగొట్టి అక్కడి నుంచి పంపించి వేశారు. అక్కడ నుంచి వెళ్లిపోయి చెర్లోపల్లెకు వెళ్లేందుకు బస్సుకోసం వేచి ఉన్న విద్యార్థులపై గుర్రంకొండకు చెందిన విద్యార్థులు మరోసారి దాడికి పాల్పడ్డారు. ఈ దాడుల్లో కొంతమంది విద్యార్థులకు చేతులకు, ముఖంపై స్వల్ప గాయాలయ్యాయి. బస్టాండులో ఉన్న కొంతమంది వీరిని అడ్డుకొని అక్కడి నుంచి పంపించి వేశారు. హైస్కూలు వయసులోనే విద్యార్థులు ఇలా గ్యాంగ్ దాడులకు పాల్పడటంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు.

భాకరాపేట చెక్ పోస్టు వద్ద రూ. 9 లక్షలు పట్టివేత


భాకరాపేట చెక్ పోస్టు వద్ద నగదును స్వాధీనం చేసుకున్న ఎస్ఐ పెద్ద ఓబన్న

సిద్దవటం : మండలంలోని భాకరాపేట చెక్‌పోస్టు వద్ద శనివారం రాత్రి రూ. 9 లక్షల నగదు పట్టుకున్నట్లు సిద్దవటం ఎస్ఐ పెద్ద ఓబన్న తెలిపారు. రాజంపేట నుంచి కడపకు కారులో ప్రతిమ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీకి చెందిన రూ.9 లక్షల నగదును తీసుకెళుతుండగా తనిఖీలో పట్టుకున్నామన్నారు. ఈ నగదుకు సరైన రికార్డులు లేని కారణంగా కడప ఆర్‌ఓకు అప్పగిస్తామని ఎస్ఐ తెలిపారు.

రూ.4.50 లక్షల నగదు పట్టివేత

మదనపల్లె : ఎన్నికల కోడ్ సందర్భంగా నియమించిన ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీల్లో రూ.4.50 లక్షల నగదు పట్టుకున్న ఘటన శుక్రవారం మండలంలో జరిగింది. ఎన్నికల విధుల్లో భాగంగా మదనపల్లె–చిత్తూరు జాతీయ రహదారిపై మొలకలదిన్నె వద్ద మండల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారిణి శ్రావణి ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేపట్టారు. పుంగనూరు వైపు వెళుతున్న ఓ వాహనంలోని వ్యక్తి పోలీసులను గమనించి, నగదుతో కూడిన కవర్‌ను విసిరేసి పారిపోయాడు. అధికారులు గమనించి, నగదును స్వాధీనం చేసుకుని రూ.4.50 లక్షలు ఉన్నట్లుగా గుర్తించి నియోజకవర్గ ఎన్నికల అధికారి హరిప్రసాద్‌కు సమాచా రం అందించి, ఆయన ఆదేశాల మేరకు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తర్వాత కొంతసేపటికి ఓ వ్యక్తి వచ్చి నగదు తనదేనని, పోలీసులను చూసి భయపడి వదిలేసి వెళ్లానని చెప్పుకొచ్చాడు. అయితే అధికారులు నగదుకు సరైన ఆధారాలు చూపించాల్సిందిగా కోరి, స్వాధీనం చేసుకున్న డబ్బును ప్రభుత్వ ట్రెజరీకి జమచేశారు.

ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామాలపై నిఘా పెంచండి

రేంజ్ పరిధి ఎస్పీలకు డీఐజీ ఆదేశం



కర్నూలు/కడప అర్బన్ : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామాలపై నిఘా పెంచాలని డీఐజీ సీహెచ్ విజయరావు కర్నూలు రేంజ్ పోలీసు అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. అవసరమైతే కేంద్ర సాయుధ బలగాలతో కవాతు, పోలీసు పికెట్లు ఏర్పాటు చేయాలన్నారు. గ్రేవ్ క్రైంపై ప్రత్యేక దృష్టి సారించి నేర ప్రవృత్తి గల వారిని బైండోవర్ చేయాలన్నారు. కర్నూలు రేంజ్ డీఐజీ కార్యాలయం నుంచి శనివారం కర్నూలు, నంద్యాల, కడప, అన్నమయ్య జిల్లాల ఎస్పీలతో డీఐజీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పకడ్బందీ ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలకు లోబడి బాధ్యతగా పనిచేయాలన్నారు. ఏవైనా సంఘటనలు జరిగినప్పుడు వాస్తవాలను మీడియాకు వెల్లడించాలని, బందోబస్తు విధులకు కార్యాచరణ ప్రణాళిక ఏర్పాటు చేసుకోవాలన్నారు. పోలింగ్ రోజు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని, స్ట్రాంగ్ రూమ్‌ల దగ్గర సీసీ కెమెరాలతో పకడ్బందీ నిఘా ఉంచాలన్నారు.

ఉల్లంఘనలపై ఎఫ్ఐఆర్ నమోదు చేయండి

ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన వారిపై వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసి పై అధికారులకు సమాచారం అందించాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసు బలగాలతో రూట్ మార్చ్, ఫ్లాగ్ మార్చ్ చేయించాలన్నారు. లైసెన్స్ ఆయుధాలన్నింటినీ డిపాజిట్ చేయించాలని, ఇంటిగ్రేటెడ్, బార్డర్ చెక్‌పోస్టుల్లో పోలీసులు, సెబ్, ఫారెస్ట్, ఆర్‌టీఏ అధికారులు సమన్వయంతో పనిచేసే విధంగా చూడాలన్నారు. ఎప్పటికప్పుడు చెక్‌పోస్టుల్లో తనిఖీలు చేయాలన్నారు. కర్నూలు, నంద్యాల, కడప, అన్నమయ్య జిల్లాల ఎస్పీలు కృష్ణకాంత్, రఘువీర్‌రెడ్డి, సిద్దార్థ కౌశల్, కృష్ణారావుతో పాటు ఆయా జిల్లాల అడిషనల్ ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

వెంకటేశ్వరస్వామి ఆలయంలో చోరీ


ఆలయంలో హుండీని పగులగొట్టిన దృశ్యం

రామసముద్రం : రామసముద్రం మండలం మాలేనత్తం పంచాయతీ సింగం వారిపల్లి గ్రామ సమీపంలో ఉన్న శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో రాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సింగం వారిపల్లి గ్రామంలో శ్రీ వెంకటేశ్వర స్వామి పురాతన ఆలయంలో గేటు పగులగొట్టి అమ్మవారి ఉత్సవ మూర్తుల మెడలో ఉన్న బంగారు బొట్టులు 75 గ్రాములు, వెయ్యి గ్రాముల వెండి చోరీ చేశారు. అలాగే హుండీని పగులగొట్టి అందులో ఉన్న నగదును దోచుకెళ్లారు. ఆలయంలో ఉన్న బీరువాను ధ్వంసం చేసి, అమ్మవారి చీరలు, స్వామివారి పట్టువస్త్రాలు ఎత్తుకెళ్లారు. ప్రతి శనివారం లాగే ఉదయం ఆలయంలో పూజలు నిర్వహించేందుకు వెళ్లగా చోరీకి గురైనట్లు గుర్తించినట్లు చెప్పారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఎస్ఐ చంద్రశేఖర్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఎర్రచందనం పార్కు అభివృద్ధికి చర్యలు


అధికారులతో సమావేశమైన సీసీఎఫ్ నాగేశ్వరరావు

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు పట్టణంలోని ఎర్రచందనం పార్కును అభివృద్ధి చేసేందుకు అన్ని విధాలా చర్యలు తీసుకుంటామని అటవీశాఖ సీసీఎఫ్ నాగేశ్వరరావు శనివారం తెలిపారు. స్థానిక ఎర్రచందనం పార్కును అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎర్రచందనం పార్కును పర్యాటక కేంద్రంగా, సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారి వివేక్, కోడూరు రేంజర్ రఘునాథరెడ్డి, తదితర అధికారులు పాల్గొన్నారు.



సులభంగా ధ్రువపత్రాలు



గతంలో మా పిల్లల కోసం ఏవైనా ధ్రువపత్రాలు పొందాలంటే మీసేవలో దరఖాస్తు చేసుకుని, అనంతరం కార్యాలయాల చుట్టూ, మీ సేవ చుట్టూ తిరగాల్సి వచ్చేది. అయినా సకాలంలో చేతికందేవి కావు. అయితే జగనన్న సురక్ష కార్యక్రమంలో గ్రామ వలంటీర్లకు ధ్రువపత్రాలు కావాలని చెప్పగానే ఒక్కరోజులోనే ఇంటి వద్దకే ధ్రువపత్రాలు తెచ్చి ఇచ్చారు. ఇవి పిల్లలకు ఉపయోగపడ్డాయి. ఇన్ని సేవలందిస్తున్న ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం.

– కె. జయలక్ష్మీ, దుర్గానగర్, పీలేరు.

అన్నలా ఆదుకున్నాడు



మాది నిరుపేద కుటుంబం. మాకు ముగ్గురు ఆడ పిల్లలు సంతానం. నా భర్త బందల క్రిష్ణమూర్తికి వికలాంగ పెన్షన్, మా అత్త ఈశ్వరమ్మకు మంజూరయ్యే వృద్ధాప్య పెన్షన్ సొమ్ముతో జీవనం సాగించేవాళ్లం. నెల రోజుల క్రితం నా భర్త అనారోగ్యంతో మృతి చెందడంతో మేము మానసికంగా ఎంతో కుంగిపోయాము. ఈ తరుణంలో జగనన్న పుణ్యమా అని వైఎస్సార్ బీమా సొమ్ము రూ.లక్ష మంజూరు కావడంతో మాకు జీవితంపై భరోసా కలిగింది. వైఎస్సార్‌సీపీ పాలనలో నా కుమార్తెకు అమ్మ ఒడి, మా అత్తకు నెలవారి పెన్షన్, చేయూత, వైఎస్సార్ ఆసరా సొమ్ము, రైతు భరోసా, సున్నా వడ్డీ పథకాలతో మా కుటుంబం ఎంతో లబ్ధి పొందింది. ఇన్ని సంక్షేమ పథకాలు అందిస్తూ మా లాంటి నిరుపేద కుటుంబానికి ఓ అన్నలా ఆదుకున్న జగనన్నకు జీవితాంతం మేము రుణపడి ఉంటాం.

– బందల అంజలి, పెద్దతిప్పసముద్రం, తంబళ్లపల్లి నియోజకవర్గం, అన్నమయ్య జిల్లా.

అవగాహనతోనే క్షయకు దూరం



- సకాలంలో గుర్తిస్తే నివారణ సాధ్యమే
- నేడు ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం


పౌష్టికాహారం అందిస్తున్న మదనపల్లె ఎన్‌టీఈపీ సిబ్బంది

మదనపల్లె సిటీ: ఒకప్పుడు క్షయ అంటే హడలిపోయేవారు. వ్యాధి పడిన రోగిని చూస్తే అల్లంత దూరానికి వెళ్లేవారు. కానీ ఇప్పుడు పరిస్థితి మారింది. క్షయ బాధితులు ఎంచక్కా దగ్గర్లోని ఆరోగ్య కేంద్రానికిగానీ, డీఎంసీకి గానీ వెళ్లి పరీక్షలు చేయించుకుంటున్నారు. తొలిదశలోనే ప్రభుత్వం అందిస్తున్న మందులు, మాత్రలు వాడుతూ వ్యాధిని నయం చేసుకుంటున్నారు. నేడు ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా క్షయ, లక్షణాలు, నివారణ తదితర అంశాలపై ప్రత్యేక కథనం. ...



కేంద్రాలు: జిల్లాలో మదనపల్లె అర్బన్, రూరల్, రాయచోటి, లక్కిరెడ్డిపల్లె, నందలూరు, రైల్వేకోడూరు, పీలేరు, తంబళ్లపల్లె, వాల్మీకిపురంలో టీబీ కేంద్రాలు ఉన్నాయి.

క్షయ గురించి తెలుసుకుందాం...

1845–1910 మధ్య కాలంలో రాబర్ట్ కోచ్ అనే జర్మన్ శాస్త్రవేత్త టీబీకి కారణమైన ట్యూబర్ కిలోసిస్ బ్యాక్టీరియాను కనుగొన్నారు. ఈ బ్యాక్టీరియా ద్వారానే క్షయ వస్తున్నట్లు నిర్ధారించారు. ఈ మేరకు ప్రపంచ ఆరోగ్య సంస్థ ఏటా మార్చి 24న ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం నిర్వహిస్తోంది.

'ఆధునిక నిర్ధారణ పరీక్షలు

జాతీయ క్షయ నివారణ కార్యక్రమంలో భాగంగా టీబీ వ్యాధి నిర్ధారణకు కేంద్ర ప్రభుత్వం జిల్లాకు ఆధునిక వ్యాధి నిర్ధారణ పరీక్ష పరికరాలను పంపింది. జిల్లాలో తొమ్మిది టీబీ యూనిట్లు ఉన్నాయి. ఇందులో సీబీ న్యాట్ మిషన్లతో పాటు ఆర్‌టీపీసీఆర్ పరికరాలను ఏర్పాటు చేసింది. వీటి ద్వారా గళ్లలో టీబీ క్రిములు అతి తక్కువ సంఖ్యలో ఉన్నా కూడా వాటిని గుర్తించి వ్యాధి నిర్ధారణ చేస్తారు. దీంతో పాటు ఎక్స్‌ట్రా పలమనరీ కేసులు ఎక్స్‌రే ద్వారా కూడా టీబీని గుర్తించడం జరుగుతుంది.

టీబీ రోగులకు పౌష్టికాహారం: క్షయ నిర్మూలన జిల్లాగా తీర్చిదిద్దే దిశగా చర్యలు మొదలయ్యాయి. ఇందులో భాగంగా టీబీ చికిత్స పొందుతున్న వారికి ని-క్షయ్ మిత్ర పథకం ద్వారా 512 ని క్షయ్ మిత్రల ద్వార 1115 మందిని దత్తత తీసుకుని 1080 మందికి పౌష్టికాహారం అందజేస్తున్నారు. ప్రధానమంత్రి 'టీబీ ముక్త భారత్ అభియాన్' కింద పది పంచాయతీలను ఎంపిక చేశారు. బాధితులకు ఆరు నెలల పాటు పోషకాహారాలు అందిస్తున్నారు. తద్వారా రోగ నిరోధకశక్తి పెరిగి బాధితుడికి టీబీ నుంచి పూర్తిగా విముక్తి కలుగుతుంది.

సంవత్సరం	పరీక్షల సంఖ్య	పాజిటివ్ కేసులు	ఎండిఆర్
2022	28,136	3,040	46
2023	39,869	2,703	26
2024	8,024	504	7


క్షయ కట్టడే లక్ష్యం



2025 లోపు క్షయ వ్యాధి అంతం కోసం చర్యలు చేపట్టారు. ఆ దిశగా అధికారులు,సిబ్బంది సమిష్టిగా పని చేస్తున్నారు. లక్షణాలుంటే వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేయించుకోవాలి. తొలిదశలోనే గుర్తించి చికిత్స తీసుకుంటే నివారణ సులభతరం అవుతుంది.

–డాక్టర్ శైలజ, టీబీ నివారణ అధికారి, అన్నమయ్య జిల్లా

అనుమానాస్పద స్థితిలో భవన నిర్మాణ కార్మికుడి మృతి


కొండయ్య (ఫైల్)

మదనపల్లె : భవన నిర్మాణ కార్మికుడు అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటన శనివారం మదనపల్లి మండలంలో జరిగింది. బసినికొండ పంచాయతీ అంబేద్కర్ కాలనీకి చెందిన నరసప్ప, తిప్పమ్మ దంపతుల కుమారుడు కె. కొండయ్య (35), భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తున్నాడు. పది సంవత్సరాల క్రితం దిగువకంపల్లెకు చెందిన అమరావతితో వివాహం కాగా, వీరికి జయలలిత(6), తిప్పయ్య(7), ఇద్దరు సంతానం ఉన్నారు. ఆరు సంవత్సరాల క్రితం భార్య అమరావతి భర్త కొండయ్యను వదిలి వెళ్లిపోయింది. అప్పటినుంచి పిల్లలతో కలిసి తల్లి తిప్పమ్మ వద్ద ఉంటున్నాడు. ఈ క్రమంలో సోమవారం ఇంటి నుంచి అదృశ్యమయ్యాడు. పలుచోట్ల కుటుంబ సభ్యులు వెతికారు. అతను కొంతకాలంగా మానసిక సమస్యలు ఎదుర్కొంటూ ఉండడంతో, ఎక్కడికైనా వెళ్లి ఉంటాడని తిరిగి వస్తాడని నమ్మకంతో ఉన్నారు. కాగా శనివారం సాయంత్రం నిమ్మనపల్లె బైపాస్ రోడ్డులోని పంతల చెరువులో ఓ వ్యక్తి మృతి చెంది, తేలియాడుతూ ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. తాలూకా పోలీసులకు సమాచారం అందించడంతో సీఐ ఎస్.శేఖర్ సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతి చెందిన వ్యక్తిని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ శేఖర్ తెలిపారు.

PUBLIC NOTICE

ఇందుమూలముగా యావన్మంది తిరుపతి ప్రజానీకానికి తెలియజేయడం ఏమనగా! మా కక్షిదారులైన 1) S. సంపూర్ణమ్మ, W/o.Late S.రామక్రిష్ణమనాయుడు, 2). చారుమతి దేవి, W/o. క్రిష్ణమనాయుడు వీరికి GPA Holder Naveen వీరికు సంబంధించిన ఈ క్రింద కనపరచిన షెడ్యూల్ దాఖలా భూములకు సంబంధించి కామనిగుంట గా యుండి ప్రస్తుతం బైరాగిపట్టెడ రెసిడెన్షియల్ ఏరియాలో సర్వే నెం. 242/బిలో మొత్తం విస్తీర్ణం ఎ.9-82 సెంట్లులో విస్తీర్ణం ఎ.4-60 సెంట్లు గురించి 21-03-2024 మరియు 22-03-2024 తేదీలలో ఈనాడు దిన పత్రికలో "స్వామి హథీరాంజీ మఠం" ఫిట్ పర్సన్ రమేష్ నాయుడు ఇచ్చిన తప్పుడు సమాచారం మేరకు మరియు సదరు పేపరు వారికి ఉన్న అవగాహన మేరకు ఊహించిన కథనాలు ప్రచురితమయ్యాయి. అవి ఏమంటే, సర్వే నెం. 242/బి కామనిగుంట భూమి హథీరాంజీ మఠం వారికి సంబంధించినదని, దీనిని 2015లో పెద్ద రంగయ్య, చిన్న రంగయ్య అను వారు మఠం నుంచి లీజుకు తీసుకొన్నారని దానిని నిబంధనలకు వ్యతిరేకంగా 'నవీన్' అనే వ్యక్తితో చేరి పెద్ద పెద్ద భవనాలు నిర్మిస్తూ వాటిని రియల్ ఎస్టేట్ భూములుగా మార్చేసారని, వీటిలో చాలా మంది రాజకీయ మరియు పోలీసు డిపార్ట్‌మెంట్ వ్యక్తులు ప్రమేయం వుందని, సదరు భూములపై కోర్టువారు స్టేటస్‌కో ఉత్తర్వులు ఇచ్చివున్నా కూడా, వాటిని లెక్కచేయకుండా కట్టడాలు అక్రమంగా చేపడుతున్నారని, అది గమనించిన మఠం అధికారులు తెలుసుకొని, వారి సిబ్బంది అయిన మధు, కిరణ్ లు ఫోటోలు తీసేందుకు వెళ్లగా ఆ సమయంలో నవీన్ మరియు మరో ఇద్దరు కలిసి పై తెల్పిన సిబ్బందిని ఒక గదిలో వేసి దారుణంగా కొట్టి, వారి చేతిలో బలవంతంగా డబ్బులు పెట్టి ఫోటోలు తీసి, మీరు మా నుంచి లంచం తీసుకున్నారని ఆ విధంగా అధికారులకు రిపోర్టు చేస్తామన్నట్లుగా బెదిరించి తరిమారని ఈ విషయం తెలుసుకున్న ఫిట్ పర్సన్ రమేష్ నాయుడు, నవీన్ మరియు అతని అనుచరులపైన తగు చర్యలకు, జిల్లా కలెక్టర్, యస్.పి. దేవాదాయ శాఖ కమీషనర్కు ఫిర్యాదు చేసారని, మొత్తానికి సదరు భూమి మఠం వారికి సంబంధించిన భూమి అని ప్రజలను నమ్మించే విధంగా పై తెలిపిన రెండు రోజులు పత్రికలో ప్రచురించడమైనది.

పేపర్లో వచ్చిన కథనాలను/ఆరోపణలను ఖండిస్తూ, దానికి మా క్లయింట్స్ తరుపున వివరణ ఏమిటంటే:-

1908వ సంవత్సరంలో హథీరాంజీ మఠం తరుపున మహంతు ప్రయాగాదాస్ జీ, సర్వే నెం. 242/బిలో విస్తీర్ణం 4-60 సెంట్లు భూమిని మీగడ గోపాలయ్యకు శుద్ధ విక్రయం చేసినారు. తరువాత 1936వ సంవత్సరంలో సదరు మీగడ గోపాలయ్య సండ్ర మునస్వామి నాయుడుకు సదరు భూమిని అమ్మివేసినారు, తదుపరి సదరు సండ్ర మునస్వామి నాయుడు ఈ భూమిపై తన కుమారుడైన సండ్ర రామక్రిష్ణమనాయుడు గారి పేరిట 1959వ సంవత్సరంలో వీలునామాను రిజిస్టరు చేయించియుచ్చినారు. సదరు సండ్ర మునస్వామినాయుడు మరణించిన పిదప, పై తెలిపిన వీలునామా ద్వారా సండ్ర రామక్రిష్ణమనాయుడు కు సంక్రమించి, సదరు రామక్రిష్ణమనాయుడు సర్వ హక్కులతో అనుభవించుకొనుచూ ఉండి, సదరు సండ్ర రామక్రిష్ణమనాయుడు గారు 16-11-2022వ తేదీన మరణించినారు. అతను మరణించిన పిదప, అతని కుటుంబ సభ్యులైన యస్. సంపూర్ణమ్మ (భార్య) మరియు పి.చారుమతి దేవి (కుమార్తె)లకు వారసత్వ రీత్యా సంక్రమించి, సర్వహక్కులతో అనుభవించుకొనుచూ పై తెలిపిన భూమిలో సంపూర్ణమ్మ మరియు పి. చారుమతి దేవిలు కలిసి, గౌరవ Andhra Pradesh High Courtలో Writ Petition వేసియున్నారు. ప్రిన్సిపల్ సెక్రటరీ, స్టాంప్స్ & రిజిస్ట్రేషన్ డిపార్టుమెంటు మరియు ఇతర అధికారులను పై W.P.ని నమోదు చేసి, సదరు భూములను రిజిస్ట్రేషన్స్‌కు అనుమతిని ఇవ్వవలసినదిగా కేసును వేయడమైనది. ఈ షెడ్యూలు దాఖలా భూములు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు 01-02-2022వ తేదీన Govt. of A.P. Memo No. REV. 01 - REG-SOCIRC (CCHC) / 825/2022 - REGN-1 ద్వారా ఉత్తర్వులు ఇచ్చియున్నారు. తరువాత సదరు భూమికి సంబంధించిన వ్యవహారాలను చూసుకొనేందుకు వీలుగా చట్టప్రకారం నవీన్ అనే వ్యక్తికి 2023వ సంవత్సరంలో రిజిస్టరు జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ డీడును నవీన్ పేరిట రిజిస్టరు చేసియివ్వడమైనది. సదరు జి.పి.ఏ. ప్రకారం కొన్ని ప్లాటు జాగాలను ఇతరులకు విక్రయించినారు. కొనుగోలు చేసిన వ్యక్తులు వారి వారి ఇంటి జాగాలను అనుభవించుకొనుచున్నారు.

పైన వివరించిన ప్రకారం మరొక్క సారి మా కక్షిదారులు తరుపున తెలియజేయడం ఏమనగా, తిరుపతి అర్బన్ మండలం, తిరుపతి గ్రామ లెక్కదాఖలా, కామనిగుంటగా యుండి ప్రస్తుతం బైరాగిపట్టెడ రెసిడెన్షియల్ ఏరియా సర్వే నెం. 242/బిలో విస్తీర్ణం ఎ.4-60 సెంట్లు భూమిపై "స్వామి హథీరాంజీ మఠం" భూమి ఎంతమాత్రమూ కాదు. ఈ భూమి పూర్తిగా ప్రైవేటు భూమి. హథీరాంజీ మఠం వారికి, పెద్ద రంగయ్య మరియు చిన్నరంగయ్యలకు ఉన్న వ్యవహారాలకు మా క్లయింటుకు ఎలాంటి సంబంధం లేదు. 1908లో మఠం వారు అమ్మివేసిన భూమిని, లీజుకు ఇచ్చినారని చెప్పడం, పై తెలిపిన హక్కుదారులను ఆక్రమణదారులు అని అనడం, దీనిని అన్యాక్రాంతం చేసినారని చెప్పడం, ఏదో విధంగా కోట్లు విలువ చేసే భూములను మఠం వారే దౌర్జన్యం చేసి, ఆక్రమించాలని చూడడం చట్టరీత్యా నేరము, లీగల్ ఒపీనియన్ తీసుకొనకనే సదరు న్యూస్ పేపర్ వారు తప్పుడు న్యూస్ ను కవరేజ్ చేసి, ప్రజలను తప్పు ద్రోవ పట్టించడమే కాకుండా, కోర్టు ప్రాసెస్‌ను కూడా అబ్యూస్ చేయడం, ల్యాండ్ కొనాలని వచ్చే కొనుగోలుదారులను కొననీయకుండా భయభ్రాంతులకు గురిచేయడం, తద్వారా ల్యాండ్ యజమానులకు ఆర్థికంగా, సామాజికంగా నష్టము కలిగించడంపై, ఈనాడు సంస్థపైన, మఠం అధికారులపైన తగు రీత్యా సివిల్ క్రిమినల్ చర్యలు తీసుకొంటామని మా క్లయింట్స్ తరుపున తెలుపుతూ, సర్వే నెం. 242/బి విస్తీర్ణం ఎ. 4-60 సెంట్లు భూమి ప్రైవేటు భూమి అని మరొక్క సారి తెలియజేస్తూ, హథీరాంజీ మఠం వారికి భూమికి గాని, సదరు పెద్ద రంగయ్య, చిన్న రంగయ్యలకు గాని ఈ షెడ్యూలు దాఖలా భూమికి గాని ఎలాంటి సంబంధం లేదని తెలియజేయడం జరిగింది.

షెడ్యూలు : చిత్తూరు జిల్లా, తిరుపతి సబ్.డి., చంద్రగిరి తాలూకా నెం. 29 తిరుపతి గ్రామ లెక్కదాఖలా కామనిగుంటలో T.D. No. 2931, S.No. 242/B లో విక్రయ విస్తీర్ణం ఎ.4-60 సెంట్లు భూమికి హద్దులు, తూర్పు : అవిలాల గ్రామ లెక్కదాఖలా సర్వే నెం. 148లోని మఠం భూమి, పడమర : అవిలాల గ్రామ లెక్కదాఖలా సర్వే నెం. 242/బిలో మఠం వారు నిలుపుకున్న భూములు, ఉత్తరం : పెద్ద చెరువు క్రింద పట్టెడతోట, దక్షిణం : తిరుపతి పెద్ద చెరువు కలుజా కాలువ ఈ మధ్య విస్తీర్ణం ఎ.4-60 సెంట్లు భూమి యావత్తు పూరా.

PARITALA SYAM KUMAR, B.Com., B.L.,
K. JAYACHANDRA RAJU, M.A., B.L.,
ADVOCATES
2nd Cross, Royal Nagar,R.C. Road, Tirupati. **Cell: 9440799637**